సాక్షి ఖమ్మం

గురువారం । 14 । ఆగస్టు । 2025



పెళ్లింట పెను విషాదం

ఇంకొద్ది గంటల్లో చెల్లెలిని పెళ్లి పీటలపై చూడాల్సిన యువకుడు, వారి బంధువు రోడ్డుప్రమాదంలో మృతి చెందారు. 8లో



జవాన్‌కు కన్నీటి వీడ్కోలు

కశ్మీర్‌లో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన ఆర్మీ జవాన్ అనిల్‌కు కుటుంబీకులు, స్థానికులు కన్నీటి వీడ్కోలు పలికారు. 8లో

గరిష్టం / కనిష్టం
25° / 23°

వాతావరణం

జిల్లాలో గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో చిరు జల్లులు మొదలు ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.,

న్యూస్‌రీల్

పంద్రాగస్టుకు ముఖ్యఅతిథి డిప్యూటీ సీఎం భట్టి

ఖమ్మం సహకారనగర్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో శుక్రవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. ఈమేరకు జిల్లాల వారీగా పతాకాలను ఆవిష్కరించే మంత్రుల జాబితాను ప్రభుత్వం విడుదల చేసింది. ఇందులో భాగంగా ఖమ్మం పరేడ్ గ్రౌండ్‌లో జరిగే వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి జాతీయ జెండా ఆవిష్కరిస్తారు. అలాగే, కొత్తగూడెం జిల్లాలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జాతీయ జెండా ఆవిష్కరించనున్నారు.

నేడు ఎర్రుపాలెంలో పర్యటన

ఎర్రుపాలెం: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క గురువారం ఎర్రుపాలెం మండలంలో పర్యటించనున్నారు. మండలంలోని అయ్యవారిగూడెం, బుచ్చిరెడ్డిపాలెం, పెద్దగోపవరం, బనిగండ్లపాడు, ఎర్రుపాలెం గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు భట్టి శంకుస్థాపన చేస్తారు. ప్రభుత్వం ఎస్సీ సబ్‌ప్లాన్ ద్వారా కేటాయించిన రూ.4కోట్ల నిధులతో ఈ రహదారులు నిర్మించనున్నారు.

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10గంటలకు కూసుమంచి మండలం పాలేరు, 10–30 గంటలకు మల్లాయిగూడెంలో అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేస్తారు. అలాగే, 11–30 గంటలకు నేలకొండపల్లి మండలం బోదులబండ జెడ్పీహెచ్‌ఎస్‌లో 8వ తరగతి విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేశాక వెటర్నరీ ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రైవేట్ కార్యక్రమాలకు హాజరవుతారు.

హెచ్‌ఐవీ కట్టడికి విస్తృత ప్రచారం

ఖమ్మంవైద్యవిభాగం: అంగన్‌వాడీ టీచర్లు హెచ్‌ఐవీపై అవగాహన పెంచుకోవడమే కాక కట్టడి కోసం విస్తృతంగా ప్రచారం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.కళావతిబాయి సూచించారు. అంగన్‌వాడీ టీచర్లకు కలెక్టరేట్‌లో బుధవారం ఇచ్చిన శిక్షణలో ఆమె మాట్లాడారు. హెచ్‌ఐవీ సోకిన వ్యక్తులపై వివక్ష చూపకుండా నిరంతరం మందులు వాడేలా అవగాహన కల్పించాలని తెలిపారు. అంతేకాక ప్రతీ గర్భిణికి హెచ్‌ఐవీ పరీక్ష చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, సంస్థల బాధ్యులు డాక్టర్ పి.వెంకటరమణ, డాక్టర్ చందునాయక్, డాక్టర్ బిందుశ్రీ, డాక్టర్ పి.రామారావు, డాక్టర్ లక్ష్మణరావు, సుబ్రహ్మణ్యం, అన్వర్, దుర్గా, బాలాజీ, డి.సత్యకుమార్, మహమూద్‌అలీ, కొండల్, హలీం, సోహెల్ పాల్గొన్నారు.

సిఫారసు మేరకే ఎరువులు వాడాలి

వైరా: రైతులు అధికారుల సూచనల మేరకే పంటల్లో యూరియా, ఇతర ఎరువులు ఉపయోగించాలని వైరా కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ సుచరితాదేవి సూచించారు. పంట దశ ఆధారంగా ఎంత మోతాదులో యూరియా అవసరమో అంతే కొనుగోలు చేయాలని తెలిపారు. తద్వారా ఎవరికీ ఇబ్బందులు ఉండవని వెల్లడించారు. అలాగే, పచ్చిరొట్ట సాగు చేసిన రైతులు తక్కువ మోతాదులో నత్రజని ఎరువు ఉపయోగించాలని సూచించారు. పంట ఎదుగుదలకు అనుగుణంగా ప్రతీ 15 – 20 రోజులకు కాంప్లెక్స్ ఎరువు చల్లితే మొక్కలు బాగా పెరిగి దిగుబడి గణనీయంగా పెరుగుతుందని కోఆర్డినేటర్ ఓ ప్రకటనలో సూచించారు.

ఇద్దరు ఎంఈఓల మార్పు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని రెండు మండలాల విద్యాశాఖాధికారుల(ఎంఈఓల)ను మారుస్తూ విద్యాశాఖ డైరెక్టర్ పి.మదన్‌మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. కూసుమంచి హైస్కూల్ హెచ్‌ఎం వీరస్వామి మండల ఎంఈఓగా వ్యవహరిస్తుండగా ఆయన స్థానంలో నేలపట్ల హెచ్‌ఎం బీ.వీ..రామాచారిని నియమించారు. అలాగే, ఏన్కూరు ఎంఈఓగా ఉన్న రహీంబీ స్థానంలో జన్నారం జెడ్పీహెచ్‌ఎస్ జి.మన్మోహన్‌రెడ్డి నియమితులయ్యారు. వీరిద్దరు త్వరలోనే విధుల్లో చేరే అవకాశం ఉంది. కాగా, సీనియర్ హెచ్‌ఎంలు కాకుండా జూనియర్లను ఎంఈఓ(ఎఫ్‌ఏసీ)లుగా నియమించారనే ఆరోపణలతో మార్పు చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

టెస్ట్‌ట్యూబ్ సెంటర్లలో తనిఖీ

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లా కేంద్రంలోని పలు సంతాన సాఫల్య కేంద్రాల్లో హైదరాబాద్‌కు చెందిన వైద్య, ఆరోగ్య శాఖ బృందం బుధవారం తనిఖీ చేసింది. రెండు బృందాలుగా విడిపోయిన అధికారులు ఖమ్మంలోని రోహిత్ టెస్ట్‌ట్యూబ్ సెంటర్, ప్రవీణ, మాతృశ్రీ, శ్రీగర్భ జోయాబిన్స్, కార్తిక్ టెస్ట్‌ట్యూబ్ సెంటర్లలో తనిఖీ చేశారు. అనుమతులు, ఇప్పటి వరకు చేసిన చికిత్స రికార్డులు పరిశీలించినట్లు తెలిసింది. కాగా, రాష్ట్ర అధికారుల బృందం తనిఖీల విషయమై తమకు సమాచారం లేదని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కళావతిబాయి వెల్లడించడం గమనార్హం.

అంతటా అప్రమత్తం



ఖమ్మంలోని మున్నేరులో వరద ప్రవాహం

వాతావరణ శాఖ హెచ్చరికలతో ముందస్తు చర్యలు

- మున్నేటికి ఇరువైపులా పునరావాస కేంద్రాలు సిద్ధం
- చెరువులు, వాగుల వద్ద పెట్రోలింగ్
- అందుబాటులోకి వలంటీర్లు, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు
- నేడు విద్యాసంస్థలకు సెలవు



కాల్వొడ్డు వద్ద పరిశీలిస్తున్న సీపీ సునీల్‌దత్, కేఎంసీ కమిషనర్ అభిషేక్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలు.. ఎగువ ప్రాంతాల్లో ఇప్పటికే వర్షాలు కురుస్తున్న నేపథ్యాన అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. గత ఏడాది అనుభవాల దృష్ట్యా ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా మున్నేరు పరీవాహక ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. మున్నేటికి ఇరువైపులా ఇప్పటికే పునరావాస కేంద్రాలను సిద్ధం చేశారు. అత్యవసర సమయాన సహాయక చర్యల కోసం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. చెరువులు, వాగుల వద్ద పెట్రోలింగ్ ముమ్మరం చేయడమే కాక కలెక్టరేట్, పోలీసు కమిషనరేట్, మున్సిపాలిటీల్లో కంట్రోల్‌రూమ్‌లు ఏర్పాటుచేశారు.

పరీవాహకంలో ఎడతెరిపి లేకుండా..

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షపాతం వివరాలను అధికారులు తెప్పించుకుంటున్నారు. వరంగల్, జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లో మంగళవారం భారీ వర్షం కురిసింది. బుధవారం కూడా మున్నేరు, ఆకేరు పరీవాహక జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిశాయి. మున్నేరు పరీవాహకంలో రాత్రి 8గంటల వరకు 7.1 సెం.మీ., ఆకేరు పరీవాహకంలో 1.0 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

పునరావాస కేంద్రాలు

భారీ వర్షాలు, వరదల నేపథ్యాన మున్నేటి పరీవాహక ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తల్లో నిమగ్నమయ్యారు. శిక్షణ వలంటీర్లతో అవగాహన కల్పిస్తూనే గజ ఈతగాళ్లు, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను సమాయత్తం చేశారు. ఖమ్మం కార్పొరేషన్‌లో 12డివిజన్లు, ఏదులాపురం మున్సిపాలిటీలో 12వార్డులను ముంపు ప్రాంతాలుగా గుర్తించారు. ఈ ప్రాంతాలను వరద ముంచెత్తితే ప్రజలకు ఆశ్రయం కల్పించేలా 11 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు.

టోల్‌ఫ్రీ, కంట్రోల్ రూమ్ నంబర్లు

కార్యాలయం	నంబర్లు
కలెక్టరేట్	1077, 90632 11298
కేఎంసీ	83338 33696
ఏదులాపురం	95156 85414
ఖమ్మంరూరల్ తహసీల్	83319 30583
పోలీసులు	డయల్ 100
పోలీసు కమిషనరేట్	87126 59111

కట్టుదిట్టంగా ఏర్పాట్లు

వరదలపై కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అలాగే, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ పోలీస్ యంత్రాంగాన్ని అలర్ట్ చేశారు. ఉధృతంగా ప్రవహిస్తున్న చెరువులు, వాగుల వద్ద పోలీస్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని, పశువుల కాపరులెవరూ చెరువులు, వాగులు దాటొద్దని హెచ్చరించారు. నీటి ఉధృతి ఎక్కువగా ఉంటే వంతెనలు, చప్టాలపై రాకపోకలు నిలిపేస్తున్నారు.

ఆపద తొలగే వరకు..

ఒకేసారి భారీ వర్షం పడి వరద ముంచెత్తితే తక్కువ సమయంలో తీవ్ర నష్టం వాటిల్లుతుంది. గత ఏడాది ఇలాంటి అనుభవమే ఎదురైనందున ఈసారి ముందస్తు చర్యలకు ఉపక్రమించారు. డ్రెయిన్లలో మురుగునీరు నిల్వ ఉండకుండా సాఫీగా వెళ్లేలా శుభ్రం చేయిస్తూనే పారిశుద్ధ్య పనులపైనా దృష్టి సారించారు. కాగా, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య బుధవారం కాల్వొడ్డు, ప్రకాష్‌నగర్ ప్రాంతాల్లో మున్నేరు వరదను పరిశీలించి పరిస్థితులు అంచనా వేశారు. బుధవారం సాయంత్రం ఖమ్మంలోని కాల్వొడ్డు వద్ద మున్నేరు 10 అడుగుల మేర ప్రవహిస్తోంది.

నేడు విద్యాసంస్థలకు సెలవు

భారీ వర్షాల నేపథ్యాన అన్ని యాజమాన్యాల పరిధి విద్యాసంస్థలకు గురువారం సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ అనుదీప్ తెలిపారు. అలాగే, ప్రజలు అప్రమత్తంగా ఉంటూ అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని, నీటి ప్రవాహాలు దాటే ప్రయత్నం చేయొద్దని ఆయన సూచించారు.

16 అడుగుల వరద వస్తే మొదటి హెచ్చరిక..



కాల్వొడ్డు వద్ద మున్నేరు 16అడుగులకు చేరితే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేస్తాం. ఆ వెంటనే కాల్వొడ్డు, బొక్కలగడ్డ ప్రాంతాల్లోని వారిని పునరావాస కేంద్రాలకు తరలిస్తాం. నగరంలోని 12 డివిజన్ల పరిధిలో లోతట్టు ప్రాంతాలను గుర్తించాం. అక్కడి ప్రజలను అప్రమత్తం చేసేందుకు వలంటీర్లను సిద్ధం చేశాం. ఎవరెవరిని ఏ పునరావాస కేంద్రానికి తరలించాలో మ్యాపింగ్ కూడా చేశాం.

– అభిషేక్ అగస్త్య, కమిషనర్, కేఎంసీ

ఎంత వరద వస్తే ఎక్కడ నష్టం?



మున్నేటి వరదతో జోన్ల వారీగా అధికారులు చేసిన మ్యాపింగ్

గతేడాది ముంపు ఆధారంగా మ్యాపింగ్

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలో కురిసే వర్షంతో పాటు ఎగువ నుంచి వరద వస్తే మున్నేరు పోటెత్తే అవకాశముంది. గతేడాది సెప్టెంబర్ 1న తెల్లవారుజాము 4గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వచ్చిన వరదతో పరీవాహక కాలనీలకు భారీ నష్టం ఎదురైంది. ఈమేరకు గత ఏడాది వరద అంచనా ఆధారంగా మున్నేటికి ఎన్ని అడుగుల వరద వస్తే ఎన్ని కాలనీల్లో ఎన్ని ఇళ్లు నీట మునుగుతాయో అధికారులు లెక్కలు తేల్చారు. ఇందులో భాగంగా 16 అడుగులు వరద వస్తే మునిగే ఇళ్లను గూగుల్ ఎర్త్ మ్యాప్‌లో ఆరెంజ్ జోన్‌గా, 20 అడుగులు వస్తే మునిగే ప్రాంతాన్ని బ్లూ జోన్‌గా, 25 అడుగుల వరదతో నష్టం ఎదురయ్యే ప్రాంతాన్ని పింక్ జోన్‌గా గుర్తించడమే కాక 32 అడుగుల వరద వస్తే ప్రభావితమయ్యే ప్రాంతాలను రెడ్ జోన్‌లో చేర్చారు. ఈమేరకు డివిజన్లు, ఇళ్ల వారీగా జోన్లను నిర్ధారించి వరద ఆధారంగా ఆన్‌లైన్‌లో నమోదుకు సిద్ధమయ్యారు.

మొదట అక్కడే..

- మున్నేటికి కాల్వొడ్డు వద్ద 16అడుగుల మేర వరద వస్తే తొలుత బొక్కలగడ్డ, పద్మావతినగర్, మోతీనగర్, దానవాయిగూడెం ప్రాంతాల్లోని పలు ఇళ్లల్లోకి వరద నీరు చేరుతుంది. దీంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయగానే ఆయా ప్రాంతాల్లోని ఇళ్లను అధికారులు ఖాళీ చేయిస్తారు. ఈమేరకు 35వ డివిజన్‌లోని మోతీనగర్‌లో 15 ఇళ్లు, 48వ డివిజన్ పద్మావతినగర్‌లో 14, 47వ డివిజన్ బొక్కలగడ్డలో 30, 59వ డివిజన్ దానవాయిగూడెంలో 14 ఇళ్లకు వరద ప్రభావం ఉంటుందని తేల్చారు.
- ఇక 25 అడుగుల మేర వరద వస్తే 16వ డివిజన్‌లో అగ్రహారం కాలనీలో 64, 28వ డివిజన్‌లో శ్రీనివాసనగర్‌లో 5, 30వ డివిజన్ సుందరయ్యనగర్‌లో 54, 34వ డివిజన్‌లో రంగనాయకుల గుట్టలో 10, 35వ డివిజన్‌లో గ్యాస్ గొడౌన్ వద్ద 48, 48వ డివిజన్‌లో వెంకటేశ్వరనగర్‌లో 80, 47లో నయాబజార్ వద్ద 78, 59లో రైయిన్‌బో నగర్‌లో 57, 60వ డివిజన్‌లో రామన్నపేట కాలనీలో 80 ఇళ్లపై వరద ప్రభావం ఉంటుంది.
- మున్నేరుకు 32 అడుగుల వరద వస్తే వీటన్నింటితో పాటు 16వ డివిజన్ కొత్తూరులో 104 ఇళ్లు, 17వ డివిజన్‌లో కాల్వకట్ట వద్ద 12 ఇళ్లు, 28వ డివిజన్‌లో కుమ్మరిబజార్ వద్ద 16 ఇళ్లలోకి నీరు చేరనుంది. అంతేకాక 30వ డివిజన్‌లో పెద్దమ్మ గుడి ప్రాంతంలో 98 ఇళ్లు, 34వ డివిజన్‌లో రంగనాయకుల గుట్ట వద్ద 24 ఇళ్లు, 35వ డివిజన్‌లో 186 ఇళ్లు, 46వ డివిజన్‌లో బీసీ కాలనీలో 128 ఇళ్లు, 48వ డివిజన్‌లో 194 ఇళ్లు, 47వ డివిజన్‌లో 160 ఇళ్లు, 59వ డివిజన్‌లో ప్రభుత్వ పాఠశాల వద్ద 190 ఇళ్లు, 60వ డివిజన్‌లో జిల్లా జైలు వద్ద 170 ఇళ్లు నీట మునగనున్నట్లు అధికారులు గుర్తించారు.

గణేష్ ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాటు

- ప్రతీ విగ్రహం సమాచారం తప్పనిసరి
- అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి



సమీక్షలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, పక్కన అధికారులు

ఖమ్మంగాంధీచౌక్: రానున్న వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి సూచించారు. గణపతి నవరాత్రోత్సవాలపై కలెక్టరేట్‌లో బుధవారం అధికారులు, ఉత్సవ కమిటీలతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వర్షాలు కురిసే అవకాశమున్నందున నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అంతేకాక ప్రతీ మండపం వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకుని, అన్ని వివరాలు సమర్పించాలని సూచించారు. అలాగే, మండపాలకు విద్యుత్ అనుమతి, నిమజ్జనం రోజు రూట్‌మ్యాప్ తయారీ తదితర అంశాలపై అదనపు కలెక్టర్ సూచనలు చేశారు. కాగా, గత ఏడాది మాదిరిగా ఈసారి సైతం మట్టి విగ్రహాలు ఏర్పాటుచేయాలని తెలిపారు. ఈ సమావేశంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్, డీఆర్వో పద్మశ్రీ, డీపీఓ ఆశాలత, డీఎంహెచ్‌ఓ కళావతిబాయి, కేఎంసీ అసిస్టెంట్ కమీషనర్ అనిల్‌కుమార్, ఖమ్మం స్తంభాద్రి సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు వినోద్ లాహోటి, కీసర జయపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారంపై దృష్టి

తల్లాడ/ఏన్కూరు: భూభారతి రెవెన్యూ సదస్సుల్లో భూసంబంధిత సమస్యలపై అందిన దరఖాస్తుల పరిశీలన, పరిష్కారంలో వేగం పెంచాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. తల్లాడ, ఏన్కూరు తహసీల్దార్ కార్యాలయాలను బుధవారం తనిఖీ చేసిన ఆయన దరఖాస్తుల స్థితిగతులపై సమీక్షించారు. భూభారతి చట్టం నిబంధనల ప్రకారంగా నోటీసులు జారీ చేసి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఏవైనా దరఖాస్తులను తిరస్కరిస్తే అందుకు స్పష్టమైన కారణాలు వెల్లడించాలని సూచించారు. కాగా, ఏన్కూరులోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాన్ని సైతం తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి డైనింగ్ హాల్, కిచెన్‌ను పరిశీలించి వర్షాల నేపథ్యాన పరిశుభ్రతపై సూచనలు చేశారు. తహసీల్దార్లు వి.సురేష్‌కుమార్, సీసీహెచ్.శేషగిరిరావు, ఉద్యోగులు భాస్కర్, మొయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అంతటా వర్షం

ఖమ్మంవ్యవసాయం: జిల్లావ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం ఉదయం 8–30 నుంచి రాత్రి 9గంటల వరకు కురిసిన వర్షపాతంపై వాతావరణ శాఖ నివేదిక విడుదల చేసింది. ఈమేరకు అత్యధికంగా మధిరలో 87.3 మి.మీ. వర్షపాతం నమోదు కాగా, బాణాపురంలో 84.5, బచ్చోడులో 76.3, సిరిపురంలో 75, కాకరవాయిలో 68, వేంసూరులో 66, ఎర్రుపాలెంలో 65.3, నాగులవంచలో 62.8, కూసుమంచిలో 60 మి.మీ. వర్షపాతం నమోదైంది. అంతేకాక బోనకల్, నేలకొండపల్లి, సత్తుపల్లి, కల్లూరు, రఘునాథపాలెం, ఖమ్మం మండలాల్లోనూ ఓ మోస్తరు వర్షం నమోదైందని నివేదికలో వెల్లడించారు.

అడవులను సంరక్షిస్తూనే అభివృద్ధి

- రాజకీయాలకు అతీతంగా ఇళ్ల కేటాయింపు
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల, పక్కన కలెక్టర్ అనుదీప్, డీఎఫ్‌ఓ సిద్ధార్థ్, పీఓ రాహుల్ తదితరులు

రఘునాథపాలెం: అభివృద్ధి అనివార్యమైన నేపథ్యాన అడవులను సంరక్షించుకుంటూనే ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంపై యంత్రాంగం దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. రఘునాథపాలెం మండలం దొనబండలో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భూసమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక సమావేశం నిర్వహించాలని సూచించారు. గ్రామంలో అవసరమైన డొంక రోడ్లను నెలలోగా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. సొంత స్థలం ఉండి గుడిసెల్లో ఉంటున్న నిరుపేదలకు తప్పక ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయని.. ఇందులో ఎలాంటి రాజకీయాలు ఉండవని మంత్రి స్పష్టం చేశారు.

అడవులకు నరికివేతకు వ్యతిరేకం

కొత్తగా అడవుల ఆక్రమణకు ఎవరు పాల్పడొద్దని మంత్రి తుమ్మల సూచించారు. అడవుల నరికివేతకు తాను వ్యతిరేకమని, అడవి ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. అటవీ ప్రాంతం తగ్గుతుండడంతోనే గ్రామాల్లో కోతుల సమస్య పెరిగిందని చెప్పారు. కాగా, గిరిజన రైతులు పోడు భూముల్లో ఆయిల్ పామ్ సాగు చేయాలని.. తద్వారా ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ రూ.2కోట్ల నిధులతో దొనబండ – గణేశ్వరం రోడ్డు నిర్మాణంతో ఖమ్మంకు దూరం తగ్గుతుందని చెప్పారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్, డీఎఫ్‌ఓ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, గిరిజన సంక్షేమ శాఖ డీడీ విజయలక్ష్మి, ఆర్‌డీఓ నర్సింహారావు, పీఆర్ ఎస్‌ఈ వెంకట్‌రెడ్డి, ఖమ్మం మార్కెట్ చైర్మన్ హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నియామకం ఎప్పుడు?

- ఇప్పటికే విడుదలైన రాష్ట్ర క్రీడా క్యాలెండర్
- గ్రామ, మండలస్థాయి క్రీడల నిర్వహణపై నీలినీడలు

ఖమ్మం స్పోర్ట్స్: రెండేళ్లకోసారి జిల్లా పాఠశాలల క్రీడా కార్యదర్శిని నియమించాల్సి ఉండగా.. విద్యాశాఖ అధికారులు ప్రతీసారి నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. విద్యాసంవత్సరం ప్రారంభమై రెండు నెలలు దాటినా కార్యదర్శిని నియమించకపోవడంపై వ్యాయామ ఉపాధ్యాయుల్లో నిరసన వ్యక్తమవుతోంది. సీనియర్ ఫిజికల్ డైరెక్టర్లు ఉన్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదన్నది అంతు చిక్కని ప్రశ్నలా మారింది.

ఉమ్మడి రాష్ట్రంలోని జీఓ ఎందుకు?

పాత జీఓల ఆధారంగా జిల్లా క్రీడా కార్యదర్శిని నియమించాలని అధికారులు చూస్తున్నారంటూ కొందరు వ్యాయామ ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీనియారిటీ ప్రాతిపదికనే నియమించాలని 2012లో జీఓ విడుదలైంది. కానీ మారుతున్న కాలానుగుణంగా ప్రతిభ కలిగిన వారినే క్రీడా కార్యదర్శిగా నియమించాలనే డిమాండ్ వస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో అమలైన జీఓను ఇప్పటికీ అనుసరించడం సరికాదని పీఈటీల వాదనగా చెబుతున్నారు. ఇప్పటి వరకు ఎందరికి శిక్షణ ఇచ్చారు, వారిలో ఎందరు విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు, విద్యార్హతలు ఏమిటి, సదరు పీఈటీ వ్యక్తిగతంగా ఎన్ని పోటీలకు ప్రాతినిధ్యం వహించాడనే అంశాల ప్రాతిపాదికన నియమిస్తే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు. ఇవన్నీ కాకుండా సీనియారిటీని పరిగణనలోకి తీసుకుంటే తప్పిదాలు జరిగే అవకాశం ఉందని చెబుతున్నారు.

అనుభవం ఉన్న వారైతే మేలు

టోర్నీల నిర్వహణ అనుభవంతో పాటు జిల్లా విద్యాశాఖ అధికారులను సమన్వయం చేసుకుంటూ పాఠశాలల్లో క్రీడాభివృద్ధికి పాటుపడే వారినే జిల్లా పాఠశాలల క్రీడల కార్యదర్శిగా నియమించాలని పలువురు కోరుతున్నారు. ఇదే సమయాన జిల్లా కేంద్రానికి సమీపంలో పని చేస్తున్న సీనియర్ లేదా జూనియర్లలో అనుభవజ్ఞులకు పదవి అప్పగించాలనే వినతులు వస్తున్నాయి. ఈ విషయాన్ని డీఈఓ దృష్టికి తీసుకెళ్లేలా కొందరు పీఈటీలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. కాగా, రాష్ట్ర క్రీడా క్యాలెండర్ ఇప్పటికే విడుదలైనందున ఈనెలలోనే గ్రామ, మండల స్థాయి పోటీలు నిర్వహించాల్సి ఉంది. ఈమేరకు జిల్లా క్రీడల కార్యదర్శిని త్వరగా నియమించాలని కోరుతున్నారు.

వరదతో పాటే వ్యాధులు

- జిల్లాలో పెరుగుతున్న డెంగీ కేసులు, జ్వరాలు
- డెంగీ కేసులు 50 దాటడంతో అప్రమత్తత
- ఫీవర్ సర్వేలో వెలుగుచూస్తున్న జ్వరబాధితులు



ఫీవర్ సర్వే నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలో సీజనల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. ముఖ్యంగా డెంగీ కేసుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. కొంతకాలంగా కురుస్తున్న వర్షాలతో పారిశుద్ధ్య సమస్య ఏర్పడి డెంగీ, వైరల్ జ్వరాలు పెరుగుతున్నాయని భావిస్తున్నారు. వైద్య, ఆరోగ్య శాఖ ముందస్తు చర్యలు తీసుకుంటున్నా కేసుల సంఖ్య ఎక్కువగానే ఉండడంతో జనం ఆస్పత్రుల బాట పడుతున్నారు. దీనికితోడు అధికారులు చేపట్టిన ఫీవర్ సర్వేలోనూ వందలాది కేసులు వెలుగు చూస్తున్నాయి.

వెలుగులోకి వందలాది కేసులు

గత నెలలో జిల్లాలో సీజనల్ వ్యాధుల ప్రభావం మొదలైంది. దీంతో వైద్య, ఆరోగ్య శాఖ అప్రమత్తమై పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, సబ్ సెంటర్ల పరిధిలో ఫీవర్ సర్వే చేపట్టింది. ఆశాలు, ఏఎన్‌ఎంలు ఇంటింటికీ వెళ్లి అనుమానితుల రక్త నమూనాలు సేకరించి మందులు పంపిణీ చేస్తున్నారు. పరిస్థితి తీవ్రత ఉన్న వారిని ఆస్పత్రులకు తరలించారు. జూలై 8నుంచి 24వ తేదీ వరకు మొదటి విడత చేపట్టిన ఫీవర్ సర్వేలో రెండు హైరిస్క్ ఏరియాలను జల్లెడపట్టారు. ఈమేరకు 342 ఇళ్లలో 1,382 మందిని పరీక్షించగా 46 మంది విషజ్వరాలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. ఆపై జ్వరాల తాకిడి పెరగటంతో జూలై 28నుంచి రెండో విడత ఫీవర్ సర్వే చేపట్టగా ఇప్పటి వరకు 1,554 మంది జ్వరంతో బాధపడుతున్నట్లు తేలింది.

డెంగీ.. పైపైకి

జిల్లాలో డెంగీ జ్వరాలు ప్రబలుతున్నాయి. ఈనెల 12వ తేదీకి 52 కేసులు అధికారికంగా వెలుగుచూశాయి. అనధికారికంగా కేసుల సంఖ్య మరింత ఎక్కువగా ఉండే అవకాశముంది. ఖమ్మం నగరంతో పాటు తిరుమలాయపాలెం, రఘునాథపాలెం, తల్లాడ తదితర మండలాల్లో కేసులు ఎక్కువగా వస్తున్నాయి. అయితే, డెంగీ చికిత్స పేరుతో కొన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో రూ.70వేల నుండి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అసలైతే ప్రైవేట్ ఆస్పత్రుల్లో డెంగీ పరీక్షలకు అనుమతి లేకపోగా.. ఎలీసా పరీక్షల కోసం రక్త నమూనాలను పెద్దాస్పత్రిలోని ఐడీఎస్‌పీ ల్యాబ్‌కు పంపించాలి. కానీ పలు ఆస్పత్రుల్లో పరీక్షలు.. ఆపై చికిత్స పేరుతో దోచుకుంటున్నట్లు తెలుస్తోంది.

ఫీవర్ సర్వే వివరాలు...

సర్వే చేసిన గృహాలు	1,57,332
పరీక్షించిన వారు	4,37,911
ఫీవర్ కేసులు	1,554

నెలల వారీగా వైరల్ జ్వరాలు, డెంగీ కేసులు

నెల	వైరల్ జ్వరాలు	డెంగీ
జూన్	5,947	01
జూలై	6,476	27
ఆగస్టు	2,596	21

(ఇప్పటివరకు)

డెంగీ కేసులు అదుపులోనే...



జిల్లాలో డెంగీ కేసులు అదుపులోనే ఉన్నాయి. కేసులు వెలుగు చూసిన ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాల ద్వారా వ్యాప్తిని కట్టడి చేశాం. ఇక సీజనల్ వ్యాధుల వ్యాప్తి నామమాత్రంగానే ఉంది. ఫీవర్ సర్వేతో ఎప్పటికప్పుడు మందులు ఇస్తుండడంతో ప్రభావం తగ్గిపోయింది. అయినా ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ జ్వరం లక్షణాలు ఉంటే ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్ష చేయించుకోవాలి.

– బి.కళావతిబాయి, డీఎంహెచ్‌ఓ

క్లుప్తంగా

డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు సెంచరీ!

మధిర: మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025–26 విద్యాసంవత్సరానికి ప్రవేశాల సంఖ్య వందకు చేరిందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రవీంద్రారెడ్డి తెలిపారు. కళాశాలలో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చొరవతో కళాశాలకు బీఎస్సీ లైఫ్ సైన్సెస్, బీఎస్సీ ఫిజికల్ సైన్స్ గ్రూపులు మంజూరయ్యాయని తెలిపారు. దీంతో ప్రవేశాలకు విద్యార్థులు ముందుకొచ్చారని పేర్కొన్నారు. కాగా, దోస్త్ ద్వారా దరఖాస్తు చేసుకుని డిగ్రీలో చేరని, దరఖాస్తు చేయని విద్యార్థుల కోసం త్వరలో స్పాట్ అడ్మిషన్లు ఉంటాయని ప్రిన్సిపాల్ వెల్లడించారు. ప్రవేశాలు వందకు చేరేలా కృషి చేసిన అధ్యాపకులు, విద్యార్థులు తల్లిదండ్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బొగ్గు ఉత్పత్తి, కార్మికుల సంక్షేమమే లక్ష్యం

సత్తుపల్లిరూరల్: బొగ్గు ఉత్పత్తిలో రక్షణ పాటిస్తూనే కార్మి కుల సంక్షేమమే లక్ష్యం గా సింగరేణి ముందుకు సాగుతోందని డీజీఎం యోహాన్ తెలిపారు. కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలేంరాజు ఆధ్వర్యాన సత్తుపల్లి జేవీ ఆర్ ఓసీ కార్యాలయంలో బుధవా రం జరిగిన మల్టీ డిపార్ట్మెంట్ టీం సమావేశంలో ఆయన మాట్లాడారు. లక్ష్యం మేర బొగ్గు ఉత్పత్తి కోసం ఉద్యోగులు, కార్మికులు సహకరించాల ని సూచించారు. ఇందుకోసం యంత్రాల పనిగంటలు పెంచాలని తెలిపారు. అనంతరం మల్టీ డి పార్ట్మెంట్ కమిటీ సమావేశాల లక్ష్యాలు, బొగ్గు ఉత్పత్తి లక్ష్యం, ఉద్యోగుల సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో జేవీఆర్ ఓసీ పీఓ ప్రహ్లాద్, ఉద్యోగులు కె.హనా సుమలత, కె.సూర్యనారా యణరాజు, మోహన్‌రావు, బి.రాజేశ్వరరావు, డి. శ్రీనివాసరావు, జి.కల్యాణ్‌రామ్, ఎస్.గోవింద్, దుర్గాప్రసాద్‌రెడ్డి, నర్సింహారావు, రామారావు, దేవదాస్ పాల్గొన్నారు.

సింహపురి, కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైళ్ల రద్దు

ఖమ్మం రాపర్తినగర్: మూడో రైల్వేలైన్ నిర్మాణ పనుల కారణంగా సింహపురి, కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిర్ణీత తేదీల్లో రద్దు చేశారు. సికింద్రాబాద్ నుంచి గూడూరు(12710) వెళ్లే సింహపురి ఎక్స్‌ప్రెస్(12710)ను ఈనెల 14, 17, 18వ తేదీల్లో, గూడూరు – సికింద్రాబాద్ మార్గం(12709)లో ఈనెల 15, 18, 19వ తేదీల్లో రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. అలాగే, తిరుపతి నుంచి ఆదిలాబాద్ వెళ్లే కృష్ణా ఎక్స్‌ప్రెస్(12705)ను ఈనెల 13నుంచి 19వ తేదీ వరకు, ఆదిలాబాద్ – తిరుపతి మార్గం(12706)లో ఈనెల 14నుంచి 20వ తేదీ వరకు రద్దు చేసినట్లు సీసీటీఓ రాజగోపాల్ వెల్లడించారు.


పశు వైద్యాధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా హరీష్



డాక్టర్ హరీష్

ఖమ్మంవ్యవసాయం: పశువైద్యాధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ అనంతు హరీష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఖమ్మం పశువైద్య, పశుసంవర్థక శాఖ కార్యాలయంలో బుధవారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఖమ్మం రూరల్ పశువైద్యాధికారి హరీష్ మూడోసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అలాగే, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ మానుకొండ రాకేష్‌కుమార్(వైరా), కోశాధికారిగా డాక్టర్ రఘుపతి(ఖమ్మం పశువైద్య ప్రయోగశాల)తో పాటు కార్యవర్గ సభ్యులుగా డాక్టర్లు ఉషశ్రీ, శశిదీప్, జానీ, కృష్ణారెడ్డి, సృజనను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా కె.ప్రదీప్‌కుమార్ వ్యవహరించగా, పశువైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం.రమేష్‌బాబు, వైద్యులు ఉపేందర్, అశోక్, సుబ్బారావు, రాంజీ, రాజు, భువనేష్, సమీరా, స్వాతిలత తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుల ముఖాముఖికి సుజాత



సుజాతను సన్మానిస్తున్న అధికారులు

ఖమ్మం సహకారనగర్: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తు చేసుకున్న వారిలో ఆరుగురు ముఖాముఖికి ఎంపిక కాగా, కేంద్ర విద్యాశాఖ నిపుణుల కమిటీ, రాష్ట్ర ఉన్నతాధికారులు బుధవారం ఆన్‌లైన్‌లో ఇంటర్వ్యూ నిర్వహించారు. జిల్లాలోని ఏన్కూరు మండలం బురద రాఘవాపురం పాఠశాల బయాలజీ ఉపాధ్యాయురాలు సాగి సుజాత కూడా ఉన్నారు. హైదరాబాద్ నుంచి ఆమె ఇంటర్వ్యూలో పాల్గొనగా విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, జేడీ మదన్‌మోహన్ ఆమెను సత్కరించారు. కాగా, పది రోజుల్లో ఉత్తమ ఉపాధ్యాయుల జాబితా వెలువడే అవకాశముంది.

హోంగార్డుకు గాయాలు

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం పెట్రోల్‌బంక్ సమీపాన జరిగిన రోడ్డు ప్రమాదంతో హోంగార్డుకు తీవ్రగాయాలయ్యాయి. గోల్‌తండాకు చెందిన ఉపేంద్రయ్య(ఉపేందర్) హోంగార్డు(డ్రైవర్)గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆయన బుధవారం రాత్రి బైక్‌పై వెళ్తుండగా పెట్రోల్ బంక్ సమీపాన కింద పడడంతో తలకు గాయమైంది. దీంతో సీహెచ్‌సీలో చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు.

మున్నేటి వరదపై నిరంతర పర్యవేక్షణ




17వ డివిజన్ శ్రీనివాస్‌నగర్‌లో హ్యాండ్ మైక్‌లు, రెయిన్ కోట్లతో సిద్ధంగా ఉన్న వలంటీర్లతో నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంతో పాటు మున్నేటి పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నందున మున్నేరుకు వచ్చే వరదను నిరంతరం పర్యవేక్షిస్తూ ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య సూచించారు. మున్నేటి వరదల నేపథ్యాన ప్రత్యేక అధికారిగా వచ్చిన జి.వేణుగోపాల్‌తో కలిసి కమిషనర్ అధికారులు, వార్డు ఆఫీసర్లతో సమీక్షించారు. అయితే, 16అడుగుల మేర వరద రాగానే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసి పరీవాహక కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు.
ఈ విషయమై వలంటీర్ల ద్వారా స్థానికులను అప్రమత్తం చేయాలని తెలిపారు. కాగా, ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి, సురక్షిత ప్రాంతాలకు తరలించేలా ఎంపిక చేసిన వలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. నగరంలోని 12 డివిజన్ల ముంపు ప్రాంతాల్లో 240 మందిని ఎంపిక చేయగా వారికి కేఎంసీ అధికారులు హ్యాండ్ మైకులు, టార్చ్‌లైట్లు, రైయిన్ కోట్లు అందజేశారు. అలాగే, ముంపు ప్రాంతాల ప్రజలు సర్టిఫికెట్లు భద్రపరుచుకునేలా కవర్లు సరఫరా చేస్తున్నారు.

పాలేరుకు తగ్గిన వరద

కూసుమంచి: మండలంలోని పాలేరురిజర్వాయర్‌కు వరద తగ్గుముఖం పట్టింది. మంగళవారం రాత్రివరకు 17వేల క్యూసెక్కుల వరదచేరగా బుధవారం సాయంత్రానికి 8,250 క్యూసెక్కులకు పడిపోయింది. ఈమేరకు రిజర్వాయర్‌కు సాగర్ నుంచి 2,168క్యూసెక్కుల నీరుసరఫరాఅవుతోంది. దీంతో దిగువకు 2,043 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. అలాగే, అలుగు ద్వారా 8,095 క్యూసెక్కుల నీరు పాలేరు ఏటిలో కలుస్తుండగా, రిజర్వాయర్ నీటిమట్టం 23.50 అడుగులుగా నమోదైంది. ఈమేరకు రిజర్వాయర్‌ను జలవనరులశాఖ ఎస్ఈమంగళంపూడి వెంకటేశ్వర్లు పరిశీలించి వరద ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఉద్యోగులకు సూచించారు.



అలుగు పారుతున్న రిజర్వాయర్

నీట మునిగిన పొలాలు

నేలకొండపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పంట పొలాల్లోకి నీరు చేరింది. అలాగే, చెరువుమాధారం చెరువు అలుగు పోస్తుండగా ఆయకట్టు పొలాలు నీట మునిగాయి. మంగాపురంతండా, చెరువుమాధారం, బుద్ధారం, రాయగూడెం తదితర గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి కనిపించింది. మంగాపురంతండాలో దాదాపు 10ఎకరాల వరి నారు కొట్టుకుపోయింది. గువ్వలగూడెం–గోకినేపల్లి మధ్య వాగు ఉధృతితో రాకపోకలు నిలిపివేశారు. బుద్ధారం–కొంగర మధ్య కూడా వాగు పొంగి పొర్లుతోంది.



మంగాపురంలో పొలంలో చేరిన నీరు

పెళ్లింట పెను విషాదం

- రోడ్డు ప్రమాదంలో వధువు అన్న, బంధువు దుర్మరణం
- వరుడికి కొత్త బట్టలు ఇచ్చేందుకు వెళ్తుండగా ఘటన



ప్రమాదానికి ముందు సోదరి హల్దీ ఫంక్షన్‌లో సాయిరంజిత్ (ఇన్‌సెట్) శ్రీనివాసరావు (ఫైల్)

తిరుమలాయపాలెం/ముదిగొండ: మూడేళ్ల క్రితం తండ్రి కన్నుమూశాడు.. దీంతో కుటుంబ బాధ్యత తీసుకున్న యువకుడు అన్నీ తానై చెల్లెలి పెళ్లి ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాడు. 24గంటలు గడిస్తే చెల్లెలిని పెళ్లి మండపంలో చూడాల్సిన ఆ యువకుడిని రోడ్డు ప్రమాదం బలి తీసుకుంది. ఆయనతో మరో బంధువు సైతం మృతి చెందడంతో అంతసేపు పెళ్లి సందడి నెలకొన్న ఇంట్లో విషాదం అలుముకుంది. ముదిగొండ మండలం గోకినపల్లి సమీపాన బుధవారం జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

వధువుకు మంగళస్నానం చేయించి...

తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలుకు చెందిన దొండేటి నాగేశ్వరరావు – పద్మ దంపతులకు కుమారుడు సాయిరంజిత్(34) కుమార్తె సాయి మనీషా ఉన్నారు. నాగేశ్వరరావు గుండె సంబంధిత వ్యాధితో మూడేళ్ల క్రితం మృతిచెందాడు. సివిల్ ఇంజనీరింగ్ చేసిన రంజిత్ కేరళలో ఉద్యోగం చేస్తూ కుటుంబ బాధ్యతలు చూసుకుంటున్నాడు. ఆయన చెల్లి సాయిమనీషా వివాహం నల్లగొండ జిల్లా దామరచర్ల వాసితో నిశ్చయం కాగా గురువారం వివాహం జరగాల్సి ఉంది. ఈమేరకు పిండిప్రోలులో చెల్లి సాయి మనీషా మంగళస్నానాల కార్యక్రమంలో కుటుంబంతో సంతోషంగా గడిపిన రంజిత్ వరుడికి పెళ్లి బట్టలు, ఇతర సామగ్రి ఇచ్చేందుకు సమీప బంధువు, తిరుమలాయపాలెంకు చెందిన కొండబాల శ్రీనివాసరావు (65)తో కలిసి కారులో దామరచర్ల బయలుదేరాడు. అయితే, భారీ వర్షం వస్తుండడంతో ముదిగొండ మండలం గోకినపల్లి వద్ద కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు నుజ్జునుజ్జు కాగా రంజిత్, శ్రీనివాసరావు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. ఈ విషయం తెలియగానే పెళ్లి పనులతో హడావుడిగా ఉన్న ఆయన కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు. తిరుమలాయపాలెంకు చెందిన శ్రీనివాసరావుకి భార్య రమాదేవి, కుమారుడు రమేష్‌బాబు, కుమార్తె శరణ్య ఉన్నారు. కొంతకాలంగా కుమార్తె శరణ్య ఇంట్లోనే ఉంటుండగా ఆయన మృతితో కుటుంబం పెద్దదిక్కును కోల్పోయింది. ఘటనపై ముదిగొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మరో ప్రమాదంలో ఇద్దరు మృతి



పల్లపు నరేష్ (ఫైల్) రాంచరణ్‌సాయి (ఫైల్)

ఖమ్మంరూరల్: మండలంలోని కరుణగిరి బ్రిడ్జి సమీపాన ఆటోను ద్విచక్రవాహనం ఢీకొట్టిన ప్రమాదంలో ఆటో డ్రైవర్‌తో పాటు ద్విచక్రవాహనదారుడు మృతిచెందాడు. బుధవారం తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదం వివరాలు... ఖమ్మం దానవాయిగూడెంకు చెందిన ఆటోడ్రైవర్ పల్లపు నరేష్(28) మంగళవారం అర్ధరాత్రి రోజు మాదిరిగానే కిరాయికి వెళ్లాడు. పలు ప్రాంతాల్లో తిరిగాక తెల్లవారుజామున నాయుడుపేట వైపు వెళ్తుండగా కరుణగిరి సమీపంలో మున్నేరు బ్రిడ్జి వద్దకు రాగానే వరంగల్ వైపు నుంచి ఖమ్మం వైపు వస్తున్న ద్విచక్రవాహనదారుడు బలంగా ఢీకొట్టా డు. ఈ ఘటనలో ఆటో, ద్విచక్ర వాహనం పూర్తిగా ధ్వంసమయ్యాయి. అలాగే, ఆటోడ్రైవర్ నరేష్ తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందగా, బైక్ నడుపుతున్న ఖమ్మం బొక్కలగడ్డకు చెందిన వున్నపు రాంచరణ్ సాయి(22)సైతం మృతిచెందాడు. ద్విచక్రవాహనం వెనకాల కూర్చున్న చల్లా వీరబాబు,రాంబాబుకు గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ నరేష్ భార్య మాధవి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐముష్కరాజు తెలిపారు.

జవాన్ అనిల్‌కు కన్నీటి వీడ్కోలు

- సైనిక లాంఛనాలతో స్వగ్రామంలో అంత్యక్రియలు
- కి.మీ. మేర జాతీయ జెండాలతో ర్యాలీ



అనిల్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, ఎమ్మెల్యే రాందాస్

కారేపల్లి: కాశ్మీర్ లోయలో జరిగిన ప్రమాదంలో కన్నుమూసిన ఆర్మీ జవాన్ బానోతు అనిల్‌కుమార్‌కు కుటుంబీకులు, స్థానికులు బుధవారం వీడ్కోలు పలికారు. జై జవాన్, అమరహే అనిల్‌కుమార్ అంటూ నినాదాల నడుమ విద్యార్థులు, యువత, స్థానికులు ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఈనెల 11వ తేదీన కాశ్మీర్‌లో జరిగిన ప్రమాదంలో కారేపల్లి మండలం సూర్యతండా గ్రామానికి చెందిన బానోతు అనిల్‌కుమార్ మృతి చెందిన విషయం విదితమే. ఆయన మృతదేహాన్ని హైదరాబాద్‌కు అక్కడి నుంచి అక్కడి నుంచి బుధవారం ఉదయం ప్రత్యేక వాహనంలో కామేపల్లి కామేపల్లి పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఈక్రమాన ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అనిల్ మృతదేహం నివాళులర్పించారు. అనంతరం కారేపల్లి క్రాస్‌లో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ నివాళులర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు.

భారీగా హాజరైన జనం

కారేపల్లి క్రాస్ వద్దకు అనిల్ మృతదేహంతో కూడిన వాహనం చేరేసరికి యువకులు, విద్యార్థులు, స్థానికులు జాతీయ జెండాలో వేచి ఉన్నారు. ఆపై ఆయన మృతదేహం ఉన్న మిలటరీ వాహనాన్ని ఏడు కి.మీ. అనుసరిస్తూ స్వగ్రామానికి చేరారు. ఆపై అనిల్ మృతదేహాన్ని ఆయన స్వగ్రామానికి తీసుకొచ్చి నివాళులర్పించాక వ్యవసాయ పొలం తీసుకెళ్లారు. అక్కడ సైనిక అధికారులు గౌరవ వందనం సమర్పించి మూడు రౌండ్లు గాలిలోకి కాల్పులు జరిపారు. ఆపై అనిల్ అంత్యక్రియలు పూర్తిచేశారు. మాజీ ఎమ్మెల్యేలు లావుడ్యా రాములు నాయక్, బానోతు చంద్రావతి, మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ సతీమణి మంజుల పాల్గొన్నారు.

నాన్న వచ్చాడురా...



చిన్నారితో అనిల్ భార్య, తల్లి

వేలాదిగా తరలివచ్చిన జన సందోహం నడుమ సూర్య తండాలోని స్వగృహానికి అనిల్ మృతదేహాన్ని తీసుకు రాగానే ఆయన తల్లి ద్వాలీ, భార్య రేణుక కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు. 'దేశ రక్షణ కోసం వెళ్లి ఇలా తిరిగి వచ్చావా' అంటూ ఆయన తల్లి చేసిన రోదనలు అందరినీ కంట తడి పెట్టించాయి. అలాగే, 'మీ నాన్న వచ్చాడురా.. చిన్నా!' అంటూ అనిల్ కుమారుడికి తండ్రి మృతదేహాన్ని చూపిస్తూ రేణుక కన్నీరుమున్నీరవడం అందరికీ ఆవేదనకు గురిచేసింది.

జిల్లాలో క్షీణించిన శాంతిభద్రతలు

ఎమ్మెల్సీ తాతా మధుసూదన్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

ఖమ్మంవైరారోడ్: జిల్లాలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ ఆరోపించారు. ఖమ్మంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ఉండగా అభివృద్ధి మాటేమో కానీ మునుపెన్నడూ లేని విధంగా శాంతిభద్రతలు ప్రమాదంలో పడడంతో ప్రజలు ఆందోళనగా గడుపుతున్నారని తెలిపారు. ఎప్పుడు ఎక్కడ చోరీ జరుగుతుందో, ఎవరిపై ఆగంతకులు దాడి చేస్తారోనన్న భయంతో గడపాల్సి వస్తోందని చెప్పారు. మంత్రులు నివాసముండే కాలనీల్లోనే దొంగలు మారణాయుధాలతో తిరుగుతుండగా, హోటళ్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయని ఆరోపించారు. పోలీసు వ్యవస్థ మంత్రుల ప్రొటోకాల్‌కే సరిపోతుండడంతో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించే సమయం చిక్కడం లేదని తాతా మధు పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, బీఆర్ఎస్ ఖమ్మం నగర, ఖమ్మం రూరల్, నేలకొండపల్లి మండలాల అధ్యక్షులు పగడాల నాగరాజు, బెల్లం వేణుగోపాల్, ఉన్నం బ్రహ్మయ్య, కార్పొరేటర్ మక్బూల్, నాయకులు ఖమర్, బొమ్మెర రామ్మూర్తి, ఉప్పల వెంకటరమణ, బిచ్చాల తిరుమలరావు, పగడాల నరేందర్, లింగనబోయిన సతీష్, తదితరులు పాల్గొన్నారు.

అక్వాడెక్ట్‌ను పరిశీలించిన కలెక్టర్

అడ్డుగా ఉన్న గుట్టల తొలగింపుపై సమీక్ష

సాక్షి ఎఫెక్ట్..

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం మండలం రాకాసి తండాలో ఆకేరుపై నిర్మించిన సీతారామ ప్రాజెక్టు అక్వాడెక్ట్‌కు అడ్డుగా బండరాళ్లు, గుట్టలు ఉండడంతో భారీ వర్షాల సమయాన వరద పోటెత్తే ప్రమాదముంది. ఈ విషయమై మంగళవారం 'సాక్షి'లో 'ఆకేరు అక్వాడెక్ట్‌కు అడ్డుగా గుట్టలు' శీర్షికన కథనం ప్రచురితం కాగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి స్పందించారు. ఈమేరకు మంగళవారం అక్వాడెక్ట్‌ను పరిశీలించేందుకు రాగా అడ్డుగా ఉన్న బండరాళ్లను పొక్లెయినర్‌తో తీయిస్తున్నారు. అయితే, వరద వచ్చే వరకు ఏం చేశారని ఇరిగేషన్ అధికారులను ప్రశ్నించారు. భూసేకరణ సమస్య ఉందని అధికారులు చెప్పగా.. వరద ప్రవాహం పరిశీలనకు సీసీ కెమెరా ఏర్పాటుచేయాలని ఇరిగేషన్ డీఈ బాణాల రమేష్‌రెడ్డిని ఆదేశించారు. అనంతరం రాకాసితండా వాసులతో మాట్లాడిన కలెక్టర్ అనుదీప్ వరద పెరిగితే పునరావాస కేంద్రాలకు వెళ్లాలని తెలిపారు. తహసీల్దార్ విల్సన్, ఎంపీడీఓ సిలార్‌సాహెబ్ ఎంపీఓ సూర్యానారాయణ పాల్గొన్నారు. అలాగే, ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి సైతం బుధవారం రాకాసి తండాను పరిశీలించిన అధికారులతో వరదపై సమీక్షించారు. ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావొద్దని సూచించారు. కూసుమంచి సీఐ సంజీవ్, తిరుమలాయపాలెం ఎస్సై కూచిపూడి జగదీష్ తదితరులు పాల్గొన్నారు



అక్వాడెక్ట్ పైనుంచి పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్

సర్వేయర్ల పరీక్షలో 141మంది ఉత్తీర్ణత

ఖమ్మం సహకారనగర్: భూభారతి చట్టం అమల్లోకి వచ్చిన నేపథ్యాన భూముల హద్దులు తేల్చేందుకు సర్వేయర్లు కీలకం కానున్నారు. ఈమేరకు సర్వేయర్లుగా పలువురికి శిక్షణ ఇచ్చి ఇటీవల పరీక్ష నిర్వహించారు. జిల్లా నుంచి 442మంది పరీక్ష రాయగా ఇందులో 141మంది ఉత్తీర్ణులయ్యారని సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులు తెలిపారు. వీరికి 40రోజుల పాటు మండలాల్లో అప్రెంటిస్ శిక్షణ ఉంటుందని వెల్లడించారు. కాగా, పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి వచ్చే నెల 13, 14వ తేదీల్లో మరోమారు పరీక్ష రాసే అవకాశం కల్పించినట్లు తెలిపారు.

హత్యకు కుట్ర పన్నిన యువకుడిపై ఫిర్యాదు



ఫిర్యాదు ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కామేపల్లి: బీఆర్ఎస్ పార్టీ నాయకుల హత్యకు ఓ యువకుడు కుట్ర పన్నాడని పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మద్దులపల్లికి చెందిన బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు సామా మోహన్‌రెడ్డి, నూకల ఉపేందర్ మాట్లాడుతూ తమను హత్య చేసేందుకు గడబోయిన హరీష్ మహబూబాబాద్ జిల్లాలోని ఓ రౌడీ షీటర్‌తో రూ.4 లక్షలకు సుపారీ కుదుర్చుకుని రూ.లక్ష చెల్లించినట్లు ఆడియో లీక్ అయిందని తెలిపారు. ఈమేరకు తమకు ప్రాణహానీ ఉన్నందున రక్షణ కల్పించడంతో పాటు పూర్తిస్థాయిలో విచారించాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. కాగా, బీఆర్ఎస్ నాయకులపై హత్యకు కుట్ర పన్నిన వ్యక్తిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రౌడీయిజం పెరిగిందని, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోనే రౌడీషీటర్ ఉంటుండడం ఇందుకు నిదర్శనమని తెలిపారు. అలాగే, తమ బీఆర్ఎస్ నాయకుల హత్యకు కుట్ర పన్నిన వారిపై చర్యలు తీసుకోవాలని మద్దులపల్లి కాంగ్రెస్, సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు.

యూరియా కోసం అవే పాట్లు

కొణిజర్ల: కొణిజర్ల సొసైటీ కార్యాలయం ఎదుట బుధవారం రైతులు బారులు దీరారు. సొసైటీ కార్యాలయానికి మంగళవారం సాయంత్రం 15టన్నుల యూరియా వచ్చిందని తెలియడంతో రైతులు బుధవారం తెల్లవారుజామునే క్యూ కట్టారు. ఒక్కో ఆధార్ కార్డుకు రెండు బస్తాల చొప్పున యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా రైతులకు సరిపడా యూరియా ఉన్నందున ఆందోళన చెందొద్దని సూచించారు.

ఎస్టీ కమిషన్ సభ్యుడికి నిర్వాసితుల వినతి



హుస్సేన్‌నాయక్‌కు వినతిపత్రం ఇస్తూ..

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం మున్నేటి పరీవాహక ప్రాంతంలో రిటైనింగ్ వాల్ నిర్మిస్తుండగా సరైన పరిహారం ఇవ్వడం లేదని భూములు, ప్లాట్లు కోల్పోతున్న పలువురు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్‌కు విన్నవించారు. ఖమ్మంకు బుధవారం వచ్చిన ఆయనకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు స్వాగతం పలికారు. అనంతరం నిర్వాసితులు కలిశారు. సుమారు 250 మంది నుంచి 50ఎకరాల భూములను రిటైనింగ్‌వాల్ నిర్మాణానికి సేకరిస్తున్నారని తెలిపారు. మార్కెట్ విలువ లేదా ప్రభుత్వ ధరపై మూడింతల పరిహారం ఇప్పించాలని కోరారు. నాయకులు సన్నె ఉదయప్రతాప్, గల్లా సత్యనారాయణ, సున్న రవికుమార్, రవిరాథోడ్, ఎం.సుబ్బారావు, ఎం.సరస్వతి, శ్యాం, మోహన్, మేకల నాగేంద్ర, రవీందర్, రాజేష్, మల్లేశ్వరి పాల్గొన్నారు.

ఎదురెదురుగా ఢీకొనడంతో కారు దగ్ధం

ఏన్కూరు: రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొనగా ఓ కారులో మంటలు చెలరేగి కాలిపోయింది. ఏన్కూరు మండలం కోనాయిపాలెం సమీపాన బుధవారం ఈ ఘటన జరిగింది. కొత్తగూడెం నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు, ఖమ్మం నుంచి చంద్రుగొండ వెళ్తున్న కారు కోనాయిపాలెం సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో నిప్పంటుకుని ఓ కారు దగ్ధమైంది. మరో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలు కావడంతో 108లో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చి మంటలు ఆర్పివేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రఫీ తెలిపారు.

గంజాయి మత్తులో యువకుల వీరంగం

ఖమ్మం అర్బన్: ఖమ్మంలోని గోపాలపురంలో కొందరు యువకులు మంగళవారం అర్ధరాత్రి గంజాయి మత్తులో వీరంగం సృష్టించారు. గోపాలపురం, ఎల్బీనగర్ ప్రాంతాలకు చెందిన పాత నేరస్తులు పది మంది వీరిలో ఉండగా.. స్థానిక షాప్ యజమాని లక్ష్మి, ఆమె కుమారుడు వేణు ప్రశ్నించగా వేణుపై దాడి చేశారు. అలాగే, ఆయన సోదరి, బావ వినోద్‌పైనా దాడి చేయగా లోపలకు వెళ్లి తలుపులు వేసుకుంటే దుకాణాలపై రాళ్లు విసిరారు. ఆపై షాప్ ఎదుట సామగ్రిపై పెట్రోల్ పోసి నిప్పంటించడంతో సమీపాన ఉన్న బైక్ కాలిపోయింది. ఆ వెంటనే నిందితులు పారిపోగా స్థానికులు మంటలు ఆర్పడంతో పెనుప్రమాదం తప్పింది. ఈ ఘటనలో వేణు, వినోద్ గాయపడగా ఖానాపురం హవేలీ పోలీసులు చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. అయితే, దాడికి పాల్పడిన వారు ఆస్పత్రికి సైతం వెళ్లి వెళ్లి బాధితులతో ఘర్షణ పడడం గమనార్హం. నిందితుల్లో పలువురు గంజాయి సేవించడంతో పాటు విక్రయిస్తుంటారని సమాచారం. కాగా, ఈ ఘటనకు సంబంధించి ఇరు వర్గాల నుంచి పోలీసులకు ఫిర్యాదులు అందించాయి.

గుట్టుగా ఓ పెళ్లి.. ఇంకో యువతితో మళ్లీ...

నేలకొండపల్లి: ఓ వ్యక్తి తన ప్రేమించిన యువతిని ఎవరికీ తెలియకుండా పెళ్లి చేసుకున్నాడు. త్వరలోనే కుటుంబీకులకు చెబుతానంటూనే మరో యువతితో పెళ్లికి సిద్ధపడిన ఘటన ఇది. నేలకొండపల్లి మండలానికి చెందిన ఓ యువతికి మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌కు చెందిన వ్యక్తితో వివాహం నిశ్చయమైంది. బుధవారం వివాహం జరగాల్సి ఉండగా, వధువు సహా బంధువులు సిద్ధమవుతున్నారు. ఇంతలోనే వరుడిని పోలీసులు తీసుకెళ్లినట్లు తేలడంతో యువతి, ఆమె బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. సదరు వ్యక్తి తాను ప్రేమంచిన యువతి(కానిస్టేబుల్)ని 20రోజుల క్రితం రహస్యంగా పెళ్లి చేసుకున్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని దాచి పెద్దలు చూసిన యువతిని పెళ్లి చేసుకునేందుకు సిద్ధం కాగా.. మొదటి యువతి డోర్నకల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకోగా పెళ్లి నిలిచిపోయింది.